ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

- బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి
- ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ ముద్ర వేయడమేంటి
- ప్రాణాలు తీసే అధికారం పాలకులకెవరిచ్చారు?
- అంబేదర్కర్ విగ్రహం వద్ద ధర్నాలో వామపక్ష, పౌరహక్కుల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలనీ, దండకారణ్యంలోని సహజవనరులను కార్పొరేట్లకు అప్పగించడాన్ని విరమించుకోవాలని వామపక్ష పార్టీల, పౌరహక్కుల నేతలు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. కేంద్రంలోని మోడీసర్కారు మావోయిస్టుల ఏరివేత పేరుతో మనుషులను ఊచకోత కోస్తుంటే సుప్రీం కోర్టు మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. వెంటనే బూటకపు ఎన్‌కౌంటర్లను సుమోటోగా తీసుకుని సమగ్ర విచారణ జరిపించాలని న్యాయస్థానాలను కోరారు. ఈ ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేస్తామని ప్రకటించారు. మావోయిస్టులను బీజేపీ ప్రభుత్వం బూటకపు ఎన్ కౌంటర్ల ద్వారా చంపడాన్ని ఖండిస్తూ 'బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక పోరాట కమిటీ' ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్దనున్న అంబేదర్కర్ విగ్రహం వద్ద వామపక్షపార్టీల నేతలు, ప్రజా, పౌరసంఘాల నేతలు, మేధావులు నిరసన కార్యక్రమం చేపట్టారు. "ఎన్ కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే.. ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి...అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగించొద్దు... మావోయిస్టులతో చర్చలు జరపాలి...' అని నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించారు.


ధర్నా చేస్తున్న వామపక్ష, పౌరహక్కుల నేతలు

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నిత్యం ప్రజల కోసం పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే తాము దేశ ద్రోహులమా? ప్రజాధనాన్ని, దేశ ఖనిజ సంపదను దోచుకుని వేలకోట్ల రూపాయలకు ఎదిగే అంబానీ, అదానీలు దేశభక్తులా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. మావోయిస్టులను చంపినంత మాత్రానా సమస్య పరిష్కారం కాదనీ, వారు అలా కావడానికి గల కారణాలను విశ్లేషించి సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పట్ల చాలా మంది మూగ వేదనకు ప్రతీకగా తాము నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల ప్రశ్నించినందుకు తనపైన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల సోషల్‌మీడియా అసత్యప్రచారాలు చేయడం, చంపుతామంటూ బెదిరించడం వంటి పరిణామాలను చూస్తుంటే అసలు ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా అన్న సందేహం వ్యక్తమవుతున్నదన్నారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహా ప్రజలే మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయని కూనంనేని హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..మార్చి 26 నాటికి మావోయిస్టులను చంపేస్తామని కేంద్ర హోంమంత్రి హోదాలో ఉండి అమిషా మాట్లాడటమే రాజ్యాంగ, చట్ట వ్యతిరేకమని చెప్పారు. ఆయన వ్యాఖ్యల్ని ఖండించారు. అసలు మనుషులను చంపే హక్కు వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమనీ, ఆరు నెలల పాటు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్టులు ప్రకటించిన తర్వాత పట్టుకొచ్చి చంపేయడం దుర్మార్గమన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ వెనుక దేశ ఖనిజవనరులను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర ఉందని విమర్శించారు. కేంద్రం వెంటనే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలనీ, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్ అవుతారా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే బాధ్యత కమ్యూనిస్టులు, ప్రజా తంత్ర వాదులు, ప్రజాస్వామిక వాదులు, పౌర సమాజంపైన ఉందన్నారు. దమ్ముంటే 2026 మార్చి నాటికి దేశంలో అవినీతిని నిరోధిస్తామనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామనీ, పాకిస్తాన్ తీవ్రవాదాన్ని అంతం చేస్తామని అమిత్‌షా ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, జస్టిస్(రిటైర్డ్) చంద్రకుమార్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్లు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ లక్ష్మణ్, ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా, సీపీఐ(ఎంఎల్)చంద్రన్న గ్రూప్ నాయకులు భాస్కర్, తదితరులు మాట్లాడుతూ... ప్రజాస్వామిక స్వభావానికి బూటకపు ఎన్‌కౌంటర్లు గొడ్డలిపెట్టులాంటివన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడంలో భాగంగానే ఆదివాసీలను, వారికి అండగా ఉంటున్న మావోయిస్టులను అడవులనుంచి బయటకు వెళ్లగొడుతున్నారని చెప్పారు. దండకారణ్యంలో అపార ఖనిజ వనరులున్న 1600 ఎకరాల భూమిని రూపాయికి ఎకరం చొప్పున ఆదానీకి అప్పగించడం దుర్మార్గమన్నారు. కేంద్రం టార్గెట్ పెట్టాల్సింది పేదరికం, అవినీతి, రైతులు ఆత్మహత్యల నివారణపై అని సూచించారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు పౌర సమాజం మద్దతుగా నిలువకపోతే భవిష్యత్తులో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నిస్తే ఇంట్లోనే ఎన్‌కౌంటర్ చేసే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఇప్పటివరకూ పట్టుకున్న మావోస్టులను వెంటనే అరెస్టుగా చూపి కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నర్సింహ్మా, జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం వెంకటేశ్, బాబూరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతిరావు, పిఒడబ్ల్యు నాయకులు సంధ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ పాల్గొన్నారు

నిఖత్ జరీన్‌కు డిజిపి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని సాధించిన టిజిఎస్పీ డీఎస్పీ నిఖత్ జరీన్‌కు రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి శుక్రవారం అభినందనలు తెలియజేశారు. బంగారు పతకాన్ని గెలవటం ద్వారా ఆమె రాష్ట్ర పోలీసుశాఖకు పేరు ప్రతిష్టలను తెచ్చిపెట్టారని కొనియాడారు. పోలీసు శాఖలోని క్రీడాకారులకు బంగారు పతకం గెలవటం ద్వారా నిఖత్ జరీన్ స్ఫూర్తినిచ్చారనీ, భవిష్యత్‌లో మరిన్ని కీర్తి శిఖరాలను ఆమె అధిరోహించాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి

- స్వాగతం పలికిన గవర్నర్, సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సిపి సజ్జనార్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆమె రాజ్‌భవన్ చేరుకుని అక్కడే లంచ్ అనంతరం కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ్నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుని అక్కడ భారతీయ కళా మహెూత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం ఆమె తిరిగి రాజ్ భవన్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేయనున్నారు. శనివారం ఉదయం అక్కడే అల్పాహారాన్ని తీసుకుని ఆమె ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి వెళ్లనున్నారు.

ఖమ్మంలో సిసిఐ కొనుగోలు కేంద్రం పెట్టాలి

- నిబంధనలు సడలించి పత్తి మొత్తం కొనుగోలు చేయాలి : పోతినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం పత్తి మార్కెట్‌లో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రయివేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం పత్తి మార్కెట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో, ఖమ్మం మార్కెట్‌లో తమకు ఎదురవుతున్న సమస్యలను, దోచుకుంటున్న తీరును పలువురు రైతులు వివరించారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో సాంకేతిక సమస్య వల్ల స్థానిక ఏఓ ఖమ్మం మార్కెట్‌లో అమ్ముకొమ్మన్నారని, అందుకే ఖమ్మం తీసుకొచ్చానని రైతు శ్రీను తెలిపారు. అధికారులు రైతులకు సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కొనుగోలు సందర్భంగా సిసిఐ అనేక కొర్రీలు పెడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన పోతినేని.. సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని ఏవోతో ఫోన్లో మాట్లాడారు.


పత్తి మార్కెట్‌లో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పోతినేని మాట్లాడుతూ.. సిసిఐ కొనుగోలు కోసం ప్రభుత్వం జిన్నింగ్ మిల్లులకు, యాజమాన్యాలకు అనుకూలంగా నిబంధనలు ఏర్పాటు చేసి రైతులను గోస పెడుతుందని అన్నారు. విదేశీ పత్తిని దిగుమతి చేసుకునేందుకు సుంకాన్ని ఎత్తేసిన కేంద్రం.. మన రైతుల పత్తిని కొనుగోలు చేసేందుకు మాత్రం కొత్త నిబంధనలు పెట్టి అంబానీ, ఆదానీ వంటి బడా బాబులకు, పెట్టుబడిదారులకు దోచి పెడుతోందని అన్నారు. వెంటనే ఖమ్మం మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఏడు క్వింటాళ్ల కొనుగోలు నిబంధనను ఎత్తేసి రైతుల వద్ద ఉన్న పత్తి మొత్తాన్నీ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాస రావు, జిల్లా నాయకులు ఎస్కే నాగుల్ మీరా, పట్టణ టూ టౌన్, త్రీ టౌన్ల కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, భూక్య శ్రీనివాసరావు, అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్ నవీన్ రెడ్డి, డివిజన్ సెక్రటేరియట్ సభ్యులు పత్తిపాక నాగసులోచన, పార్టీ త్రీ టౌన్ సెక్రటేరియట్ సభ్యులు, 31వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాయకులు షేక్ సైదులు, షేక్ ఇమామ్, ఎర్ర రంజిత్, పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య, మూడు టౌన్ నాయకులు ఎస్కే బాబు, రంగు, హనుమంతచారి, డివిజన్ నాయకులు జె వెంకన్న, బాబు, మేడబోయిన లింగయ్య, గాలి వెంకటాద్రి పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన కడియం శ్రీహరి

- 23 లోపు వివరణకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టేషన్‌ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. తనకు ఇచ్చిన నోటీసుల గురించి స్పీకర్‌తో చర్చించారు. ఈనెల 23లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేపథ్యంలో పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. ఈ నెల 23 లోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు.గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన పదిమంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు. అనంతరం విచారణ సైతం జరిగాయి. ఎమ్మెల్యేల తరపున న్యాయవాదులు, పిటిషన్ల తరపు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామిషన్ చేశారు. దానం, కడియం విషయంలో కూడా అదే ప్రక్రియను అనుసరించనున్నారు.

నిరాశ్రయులకు ఫ్రీ హ్యాండ్స్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - హైదరాబాద్



ఫ్రీ హ్యాండ్స్ వాలంటీర్లు మరోమారు తమ ఉదారతను చాటుకు న్నారు. హైదరాబాద్ రోడ్లపై నివసించే నిరాశ్రయులకు 120 దుప్పట్లను పంపిణీ చేస్తూ వీధి డ్రైవ్ నిర్వహించారు. సింగపూర్‌లో ఉన్న ముద్రకోల నవీన్ కుమార్, ఆయన స్నేహితులకు దుప్పట్ల కోసం సహకరించారని వారు తెలిపారు. వీటి పంపిణీలో సర్దార్ శివ, వంశీ, ప్రశాంత్, దేవాంశ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారని పేర్కొన్నారు.

పౌల్ట్రీ ఎగ్జిబిషన్‌కు సిఎంకు అహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ : పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పౌల్ట్రీ ఇండియా ప్రతినిధులు అహ్వానించారు. నగరంలోని హైటెక్స్‌లో నవంబర్ 25 నుంచి 28 వరకు పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 2025 జరగనుంది. ఈ మేరకు శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డిని కలిసి ఎగ్జిబిషన్‌కు రావాలని పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ కోరారు. సిఎంను కలిసిన వారిలో శ్రీకాంత్, జిఎంకె జి ఆనంద్, కె మోహన్ రెడ్డి, వి నరసింహారెడ్డి, జికె మురళి ఉన్నారు.



భూ భారతిపై హరీశ్‌రావు ఆరోపణలు నిరాధారం

- ధరణి పేరుతో బిఆర్‌ఎస్ సర్కారు దగా
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ భారతిపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలు నిరాధారమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కొట్టిపడేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ధరణి పేరుతో దగా చేసింది బిఆర్‌ఎస్ సర్కారేనని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోని తప్పిదాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై హరీశ్‌రావు రుద్దాలనుకోవడం దారుణమని విమర్శించారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సంబంధించిన భూ రికార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా నెంబర్లను అమెరికా కంపెనీ టేరాసాకి అప్పగించిందని గుర్తుచేశారు. రైతులకు నష్టదాయకమని భావించే ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి తెచ్చిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిది లక్షల సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించి గాలికి వదిలేస్తే.. తమ ప్రజా ప్రభుత్వం భూ భారతిలో ఆ విషయాన్ని చేర్చడమే కాక హైకోర్టు స్టే ఎత్తివేసేలా కృషిచేసి క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించిందని వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఐసికి భూభారతిని అప్పగించిందని చెప్పారు. భూ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేయడానికి గ్రామ పరిపాలన అధికారులను, మండల స్థాయిలో లైసెన్స్ సర్వేయర్లను నియమించిందని తెలిపారు. రైతు కమిషన్ కార్యాలయానికి ఇప్పటివరకు వచ్చిన మూడు వేల మంది రైతులకు పరిష్కార మార్గాలు సూచించడమే కాక స్థానిక రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కరిచేందుకు కృషి చేశామని వివరించారు. లక్షల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం జరగాలంటే క్షేత్ర స్థాయి యంత్రాంగం పటిష్టంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి ఒక ఎమ్మార్వో హత్యకు, ఎంతో మంది రైతుల ఆత్మహత్యలకు గత ప్రభుత్వం కారణమైందని తెలిపారు.

14న రెసోపాస్ట్ ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష

హైదరాబాద్ : రెసోనెన్స్ జూనియర్ కళాశాలలు, పాఠశాలలతో కూడిన రెసోనెన్స్ గ్రూప్ డిసెంబర్ 14న అతిపెద్ద ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష మెగా రెసోఫాస్ట్‌ను నిర్వహించనున్నట్లు తెలిపింది. దీనికి మాజీ జెడి లక్ష్మీనారాయణ శ్రీకారం చుట్టారు. ఈ ప్రతిభా పరీక్ష నగరంలోని 50 పైగా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఐదు నుంచి పదకొండో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామన్నారు. రూ.100 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు, టాప్ ర్యాంకర్లకు 100 ట్యాబ్‌లు ఇవ్వనుమని చెప్పారు.

నగరంలో 'కాఫ్' మరో స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రీమియం బిల్ట్ ఇన్ కిచెన్ సొల్యూషన్స్ సంస్థ కాఫ్ ఇండియా హైదరాబాద్‌లో తన ఉనికిని విస్తరించుకున్నట్లు ప్రకటించింది. కోటి సమీపంలోని ట్రూప్ బజార్‌లో తన బ్రాండ్ స్టోర్‌ను విహాన్ గోయల్ గ్యాలరీ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు పేర్కొంది. వినియోగదారులకు అద్భుతంగా నచ్చే కిచెన్ అనుభవాన్ని అందించాలనే కాఫ్ లక్ష్యంలో ఇదో ముందడుగు అని కాఫ్ ఇండియా సిఇఒ నళిని కుమార్ పేర్కొన్నారు.

11:12 తేదీల్లో చారిత్రక నాణేల జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో చారిత్రక నాణేల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో 107వ వార్షిక జాతీయ నాణేలసదస్సు , సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు లాంఛనంగా ఆవిష్కరించారు. న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్ఐ) సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణేల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కష్ణారావు మాట్లాడుతూ నాణేల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

డిసెంబర్ 11, 12 తేదీల్లో సదస్సు

జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసీహెచ్‌ఆర్డీ సంస్థలో డిసెంబర్ 11, 12 న రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. భారతదేశ నలుమూలల నుంచి విద్యార్థులు, స్కాలర్లు, పరిశోధకులు, న్యూమిస్‌మటిక్స్ నిపుణులు పాల్గొనే ఈ సదస్సు, నాణేల చారిత్రక, సాంస్కృతికకళాత్మక ప్రాముఖ్యతపై చర్చించేందుకు ఒక వేదికగా ఇది ఉపయోగపడనుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డిప్యూటీ డైరెక్టర్లు డా. డి. రాములు, డా. పి నాగరాజు పాల్గొన్నారు.

32 మంది ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 32 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగింది. ఇందులో ఒక అదనపు డీజీ, మరో డీఐజీ స్థాయి అధికారితో పాటు 30 మంది ఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారు. ఇందులో పది మంది జిల్లాల ఎస్పీలు, నలుగురు నగర డీసీపీలు ఉన్నారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో జిల్లాల ఎస్పీల బదిలీలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బదిలీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.



మీ కాల్మొక్తా.. మా పత్తి కొనండి సారూ..

- జడ్చర్ల సిసిఐ కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సిసిఐ కేంద్రంలో మూడ్రోజులుగా పడిగాపులు కాస్తున్నాం.. నాణ్యత, తేమ శాతం పేరుతో కొర్రీలు పెట్టడం భావ్యం కాదు.. మీ కాల్మొక్తా.. దయచేసి పత్తిని కొనుగోలు చేయాలి.." అంటూ ఓ రైతు అధికారి కాళ్లు మొక్కారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ కేంద్రంలో మహేష్ ఇండస్ట్రీలోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రంలో శుక్రవారం జరిగింది. గద్వాల జిల్లా అలంపూర్ రైతులు 90 క్వింటాళ్ల పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. మూడ్రోజుల తర్వాత 30 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ అధికారులు.. నాణ్యత, తేమశాతం పేరుతో కొర్రీలు పెడుతూ మిగతా పత్తిని కొనడానికి నిరాకరించారు. దీంతో దిక్కు తోచని పరిస్థితుల్లో ఓ రైతు సిసిఐ అధికారుల కాళ్లు మొక్కాడు. అయినా అధికారులు కనికరించడం లేదని రైతులు ఆగ్రహించారు. తాము పండించిన పత్తిని రోడ్డుపై పారబోస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పత్తిని కొనుగోలు చేయాలంటూ రైతులు సిసిఐ కొనుగోలు కేంద్రంలో నిరసనకు దిగారు. పోలీసులు రైతులను సముదాయించగా.. సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

కెటిఆర్‌వన్నీ అబద్ధాలే

- లీజు భూమికి, సొంత భూమికి తేడా తెలీని వ్యక్తి
- మేం తెచ్చిన పాలసీ సొంతభూముల్లో కన్వర్షన్ ఛార్జీల కోసమే...
- సిఎం కుటుంబసభ్యుల ప్రయోజనాలుంటే ఆధారాలు ఇవ్వాలి
- మాజీ మంత్రి కెటిఆర్‌పై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫైర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రగతికి అడ్డుపడుతూ, పారిశ్రామికవేత్తల్ని బెదిరించే ధోరణిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు మాట్లాడటం సరికాదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటిశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సౌకర్యాల కల్పనా సంస్థ (టిజిఐఐసి) నుంచి పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామికవేత్తలు గతంలో భూములు కొనుగోలు చేశారని తెలిపారు. కాలక్రమంలో ఆ పరిశ్రమలు జనావాసాల మధ్యకు రావడం, కాలుష్య కారణాలతో అనేక పరిశ్రమలు మూతపడ్డాయని వివరించారు. ఆ భూములు ఇప్పటికీ పారిశ్రామిక జోన్ పరిధిలో ఉన్నాయనీ, వాటిని ఇతర వాణిజ్య, గృహ అవసరాలకోసం వినియోగించుకొనే అవకాశం కల్పిస్తూ, జోన్ మార్పును సూచిస్తూ ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. దానికోసం 80 అడుగులు వెడల్పు రోడ్డు ఉన్న భూముల జోన్‌మార్పు కోసం 50 శాతం, అంతకంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్డుకు అనుసంధానంగా ఉన్న భూములకు 30 శాతం మేరకు కన్వర్షన్ కోసం ఇంపాక్ట్ చార్జీలు నిర్ణయించామన్నారు. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ పాలసీ తెచ్చామన్నారు. అంతేతప్ప ఇది భూముల్ని అమ్ముకోవడం కాదని వివరణ ఇచ్చారు. 2023లో బిఆర్ఎస్ ప్రభుత్వం అజామాబాద్ సహా పలు పారిశ్రామిక ప్రాంతాల్లోని లీజు భూముల్ని క్రమబద్ధీకరించేందుకు మూడు జిఓలు తెచ్చిందని గుర్తుచేశారు. మాజీ మంత్రి కేటీఆర్ లీజు భూముల క్రమబద్ధీకరణ, సొంత భూముల కన్వర్షన్‌కు తేడా తెలియని అవివేకి అని విమర్శించారు. లక్షల కోట్ల కుంభకోణానికి ప్రభుత్వం పాల్పడుతోందనీ, దానికోసం సీఎం కుటుంబసభ్యులు ఇప్పటికే ఎంఒయులు చేసుకున్నారంటూ కేటీఆర్ నోటికొచ్చినట్టు దుష్ప్రచారం చేస్తూ, ప్రజల్లో ఆందోళన రేకెత్తించాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పరిశ్రమలకు లీజుకిచ్చిన భూములపై యాజమాన్య హక్కులు కల్పిస్తూ 'ఫ్రీహోల్డ్' రైట్స్ పేరిట 2023 ఆగస్టులో మూడు ఉత్తర్వులు ఇచ్చింది వారి ప్రభుత్వ హయాంలోనేనని స్పష్టం చేశారు. శుక్రవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా తిప్పికొట్టారు. కేటీఆర్ చెప్తున్న 9,292 ఎకరాల భూమిలో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసి కేటాయించిన భూమి 4,740 ఎకరాలు మాత్రమేననీ, మిగిలిన భూమి రోడ్లు, డ్రెయినేజి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు టీజీఐఐసీ వినియోగించిందని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధి కోసం భూ కేటాయింపులు ఒక్కరోజులో చేసినవి కాదనీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇచ్చినవేనని చెప్పారు. ఆజమాబాద్, కూకట్‌పల్లి, హఫీజ్‌పేటల్లోని పరిశ్రమల భూములను ఫ్రీ హోల్డ్ పేరిట యాజమాన్య హక్కులు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేన్నారు. దానికోసం 2023 ఆగస్టు 29 ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్, జీఓ ఎమ్ఎస్ 19, 20, 21 లను కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే జారీ చేశారని వివరించారు. తాము ఆ భూములకు కన్వర్షన్ అవకాశం మాత్రమే కల్పిస్తున్నామనీ, ఈనెల 17 న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో ఇంపాక్ట్ ఫీజు నిర్ణయం జరిగిందన్నారు. 2023లో ఎన్నికలకు నాలుగు నెలల ముందు పారిశ్రామిక వాడల్లోని భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించినప్పుడు వారు ఎన్ని లక్షల కోట్లు వసూలు చేసుకున్నారో చెప్పాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించారు. పరిశ్రమల యజమానులు హక్కుల పొందాలంటే రిజిస్ట్రేషన్ విలువపై 100 శాతం చెల్లించాలని, అవి చేతులు మారితే 200 శాతం ఫీజులు కట్టాలని లీజు భూములకు జీవోలు ఎవరిచ్చారని అడిగారు. అందరూ దరఖాస్తులు చేసుకుంటే భూముల కన్వర్షన్ ఇంపాక్ట్ ఛార్జీల వల్ల రూ.4 వేల నుంచి రూ.5 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని భావిస్తున్నామనీ, యాజమాన్య హక్కులు లేనివారు కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోలేరని వివరణ ఇచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు రాష్ట్రంలో ఆర్థిక అరాచకత్వానికి పాల్పడి వెళ్లి పోతే, రెండేండ్లుగా దాన్ని సరిదిద్దుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న పరిశ్రమలను వెలుపలకు తరలిస్తామని మొదటి నుంచి చెప్తున్నామన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు కొన్ని రాష్ట్రాలు ఎకరం భూమిని 99 పైసలకే కేటాయించి, 20 ఏండ్లపాటు విద్యుత్, పన్ను రాయితీలను ఇస్తున్నాయని చెప్పారు. కానీ తెలంగాణలో భూముల విలువ ఎక్కువ, లభ్యత తక్కువగా ఉన్నందున దానికి అనుగుణంగానే విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించారు.



జాగృతి జనం బాటలో నృత్యం చేస్తున్న కవిత

భూములు తీసుకున్నారు.. కంపెనీలు రాలేదు

- భూనిర్వాసితులకు చాలీచాలని పరిహారం
- తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెలిమినేడు గ్రామంలో ఎరోస్పేస్ కోసం ప్రభుత్వం రైతుల నుంచి భూములు తీసుకున్నా కంపెనీలను మాత్రం ఏర్పాటు చేయలేక పోతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత అన్నారు. భూ నిర్వాసితులకు చాలీచాలని నష్టపరిహారంతో చేతులు దులుపుకుందని విమర్శించారు. వెలిమినేడు గ్రామ రైతుల పక్షాన జాగృతి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. జాగృతి 'జనం బాట'లో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, కందుకూరు మండలాల్లో ఆమె పర్యటించారు. కందుకూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి రాకుండా కొంతమంది అడ్డుకున్నారని విమర్శించారు. రైతులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భూములు కోల్పోయిన రైతాంగ కుటుంబాలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ సమస్య అయినా చెప్పుకుంటేనే పరిష్కారానికి మార్గం దొరుకుతుందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు దుస్థితి అధ్వానంగా తయారయ్యాయని చెప్పారు. పేదలకు సరైన వైద్యం అందడం లేదని, 'దూది ఉంటే సూది లేదు.. సూది ఉంటే దూది లేదు' అని విమర్శించారు. ఇక పేదలకు నాణ్యమైన వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యలు తెలుసుకునేందుకు జనం బాట చేపట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేసే వరకూ ఉద్యమిస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేలవింపుగానే జాగృతి ఉద్భవించిందని కవిత తెలిపారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

పిల్లల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- సోషల్ మీడియాలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి
- రాష్ట్ర చైల్డ్ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీతా దయాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లల రక్షణ, భద్రత, విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరముందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల బాలల భద్రత, బాల్య వివాహాల నియంత్రణ, పోక్సో చట్టం అమలు, చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పిల్లలకు రక్షణ, విద్య, ఆరోగ్యం, గౌరవంతో జీవించే హక్కులు ఉన్నాయని, ఈ హక్కులను కాపాడటానికి ప్రభుత్వం మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యతగా ఉండాలని చెప్పారు. ఇంకా బాల్య వివాహాలు నమోదవడం ఆందోళనకరమని, సమాచారం వచ్చిన వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని, బాల్య వివాహ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని చెప్పారు. హాస్టళ్లు, ఆశ్రమాలు, పాఠశాలల్లో పిల్లలపై వేధింపులు, నిర్లక్ష్యంపై జీరో టాలరెన్స్ విధానంతో వ్యవహరించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం పెరిగిన నేపథ్యంలో పిల్లలు సైబర్ మోసాలు, అనారోగ్యకర ఆన్‌లైన్ గేమ్స్ ప్రభావానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను గమనించాలని, వారు ఏ యాప్స్ వాడుతున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. బాలల అత్యవసర సమస్యల పరిష్కారానికి చైల్డ్‌లైన్ 1098 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పోక్సో చట్టం అమలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, సీపీఎస్ బలోపేతంపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 354 మంది చిన్నారులను గుర్తించి, డ్రాప్‌అవుట్ పిల్లలను బడిలో చేర్పించే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. షీ టీమ్, భరోసా సెంటర్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా కళా బృందాల సాయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు వందనగౌడ్, అపర్ణ, సరిత, ప్రేమలత, వచన్ కుమార్, ఆదిలాబాద్, నిర్మల్ ఎస్‌పిలు సురేందర్‌రావు, అవినాష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డీఎంఅండ్‌హెచ్‌ఓ రాథోడ్ నరేందర్, నిర్మల్ డిఇఒ భోజన్న, ప్రోగ్రాం కోర్డినేటర్ డా.సౌమ్య, విద్యా, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీస్, శాఖల అధికారులు, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నేతలు

సామినేని హంతకులను అరెస్టు చేయాలి

- ఖమ్మం సిపికి అఖిలపక్ష నేతల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హంతకులను తక్షణమే అరెస్టు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నేతలు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. అక్టోబర్ 31వ తేదీ ఉదయం 5.30 గంటల సమయంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు సామినేని రామారావును ఆయన ఇంటి వద్దనే కొట్టంలో హత్య చేశారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్, కంచుమర్తి రామకృష్ణ, మద్దినేని నాగేశ్వరరావు, కండ్రా పిచ్చయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతోపాటు మరికొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి అతి దారుణంగా హత్య చేశారని రామారావు భార్య స్వరాజ్యం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీపీని కలిసి వినతిపత్రం సమర్పించిన నేతల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య, సిపిఐ సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ నాయకులు ఉన్నారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలి

- ఆర్‌యుపిపి - టిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని ఆర్‌యుపీపీ- టీఎస్ కోరింది. ఈ మేరకు శుక్రవారం రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.ఎన్.విజయకుమార్, రాష్ట్ర అధ్యక్షులు శానిమోని నర్సిములు పాఠశాల విద్య సంచాలకలు నవీన్ నికోలస్‌కు వినతిపత్రం సమర్పించారు. టెట్ మినహాయింపు కుదరని పక్షంలో వేసవి సెలవుల్లో ప్రత్యేక టెట్ నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుల వారీగా సిలబస్ను మార్చి టెట్ పరీక్ష నిర్వహించాలని కోరారు. టెట్‌పై న్యాయ సలహాలు కోరామనీ, ఆ సలహాల మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముందుకెళ్తామని నవీన్ నికోలస్ చెప్పినట్టు నాయకులు వెల్లడించారు.

వాస్తవ పరిస్థితులు వివరించాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పుపై వేసిన రివ్యూ పిటీషన్‌లో వాస్తవ పరిస్థితులు వివరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టంలో అవసరమైన సవరణలు చేయాలని కోరారు. టెట్ పరీక్ష సిలబస్ కూడా అశాస్త్రీయంగా ఉందని,బోధించే సబ్జెక్టుకు సంబంధం లేని విషయాలపై పరీక్ష పెట్టడం సరికాదని పేర్కొన్నారు.

టెట్‌పై ఎంపీలకు వినతిపత్రాలు : తపస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంటులో చర్చించాలని తపస్ కోరింది. ఈ మేరకు శుక్రవారం తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంత్ రావు నవాత్ సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఎంపీలకు వినతిపత్రాలు సమర్పించాలని ఏబీఆర్ఎస్ఎం ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 22 నుంచి 28 వరకు రాష్ట్రంలోని ఎంపీలకు వినత పత్రాలను అందజేయనున్నట్టు వారు వెల్లడించారు.

పిల్లల ఆలోచనలకు రూపం కల్పించేది 'సైన్స్ ఫెయిర్'

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లల్లో ఉన్న ఆలోచనలకు ఒక రూపం కల్పించేది 'సైన్స్ ఫెయిర్' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో బాలికల హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచమంతా స్టార్టప్ యుగం నడుస్తోందని, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు మంచి మంచి ఆవిష్కరణలు చేస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో ఇన్నోవేషన్ లేకపోతే మనంలేమని, కరెంట్, టెలిఫోన్ లాంటివి అన్నీ ఇన్నోవేషన్ నుంచి వచ్చినవే అని అన్నారు. ఇన్నోవేషన్‌కు ఆకాశమే హద్దు అని, నిరంతర ప్రక్రియ అని, కంప్యూటర్ పోయి ఎఐ వచ్చిందని చెప్పారు. విద్యార్థుల నుంచి గొప్ప గొప్ప ఆలోచనలు రావాలని, ఆ ఆలోచనలకు ప్రతిరూపం ఇన్నోవేషన్ అని, మనకు మనం తక్కువ అంచనా వేసుకోకూడదని సూచించారు. ప్రతి విద్యార్థిలో సైంటిస్ట్, ఇంజనీర్ ఉంటాడని, సైంటిస్ట్ కూడా ఒక విద్యార్థి అని అన్నారు. సైన్స్ ఫెయిర్ విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని అందిస్తుందని, మనిషిలో ఉత్సాహం లేకపోతే ఓటమితో సమానమని చెప్పారు. మనిషిలో ప్రోత్సాహం, ఉత్సాహం ఉండాలని, మన రాష్ట్రంలో అత్యుత్తమ సైన్స్ ఫెయిర్ సిద్దిపేటకు వచ్చిందని తెలిపారు. వచ్చే టెన్త్ పరీక్షల్లో సిద్దిపేట మొదటి మూడు స్థానాల్లో నిలవాలని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఉపాధ్యాయులకు చాలా సమస్యలు ఉన్నాయని, డిఎలు, రిటైర్మెంట్ పైసలు రావట్లేదు, డిఇఒలు లేరు.. పిఆర్‌సి రాలేదని హరీశ్‌రావు అన్నారు. 33 జిల్లాకు 33 డీఈఓలలో ముగ్గురే రెగ్యులర్‌గా ఉన్నారని, ఇతర శాఖల వారికి ఈ బాధ్యతల అప్పగించడం సరికాదన్నారు. ఇలాంటి సమస్యలు అన్నింటి గురించి రాబోయే అసెంబ్లీలో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఫోన్లు, టివిలు చూడడం బంద్ చేయాలని, పొద్దున్నే లేచి మంచిగా చదువుకోవాలని, మంచి ర్యాంకులు సాధించి తల్లితండ్రుల పేర్లను, ఉపాధ్యాయుల పేర్లను, సిద్దిపేట పేరును నిలబెట్టాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ నివేదికను సమర్పించారు.

అనంతరం ప్రాజెక్టులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ప్రజాప్రతినిధులు, నాయకులు మోయిజ్, వజీర్, మల్లికార్జున్, సాయిరాం, ఎంఇఒలు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు కేంద్రం నోటిఫికేషన్

- కార్మిక హక్కులను హరించే కుట్ర : సిఐటియు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ శుక్రవారం నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు నోటిఫికేషన్ జారీ చేసింది. కార్మిక హక్కులకు అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఆ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020)ను నవంబర్ 21, 2025 నుండి అమలు చేయటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఇది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, గరిష్ట లాభాల కోసం చేసిన నష్టదాయక నిర్ణయమని పేర్కొన్నారు. తద్వారా కేంద్రం కార్మిక నిబంధనలను, సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని విమర్శించారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే 29 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని తెలిపారు. ఆత్మనిర్భర్ పేరుతో మోడీ సర్కార్ బరితెగించి ఈ చర్యకు పూనుకున్నదని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 2020 నుంచి 2025 జూలై 9 దేశవ్యాప్త సమ్మె వరకు ఐదేండ్లపాటు సమ్మెలు, పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. అయినా కోట్లాది మంది కార్మికుల నిరసనలను కేంద్రం పరిగణలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 13న ఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలు లేబర్ కోడ్‌లను అమలును నిలిపివేయాలని డిమాండ్ చేసినా ఖాతరు చేయలేదనీ, తద్వారా ఈ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకోసమే ఉన్నదని మరో సారి రుజువు చేసుకున్నదని గుర్తు చేశారు. లేబర్ కోడ్‌ల అమలుకు రూల్స్ నిర్ణయించడంతో యాజమాన్యాల దోపిడీకి అంతే లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మధ్యయుగాలను మరిపిస్తున్న కులోన్మాద క్రూరత్వం

- ఎర్ర రాజశేఖర్ హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- కెవిపిఎస్ రౌండ్ టేబుల్‌లో జస్టిస్ (రిటైర్డ్) చంద్రకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులోన్మాద క్రూరత్వం రోజురోజుకూ మధ్య యుగాల కాలాన్ని మరిపిస్తున్నదని, ఎర్ర రాజశేఖర్ హత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని జస్టిస్(రిటైర్డ్) చంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో శుక్రవారం కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రకాష్ కరత్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. వేల ఏండ్లుగా కొనసాగుతున్న కులోన్మాదం నేటికీ విషం చిమ్ముతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో తమ మతం ప్రమాదంలో ఉందని కొందరు మతోన్మాద శక్తులు ప్రచారం చేస్తున్నారు కానీ.. నిజంగా ప్రమాదంలో ఉన్నది పేదలు, దళితులే అని అన్నారు. రాష్ట్రంలో కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయని, 11 ఏండ్ల కాలంలో 142 జరిగాయని, అయినా ప్రభుత్వాల్లో ఉలుకూ పలుకూ లేదన్నారు. ఇటీవల రాష్ట్రంలో రెండు కులోన్మాద హత్యలు జరిగాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్ర రాజశేఖర్ తన తమ్ముడి ప్రేమ వివాహానికి సహకరించాడనే కోపంతో.. అతన్ని కిడ్నాప్ చేసి హత్య చేయడం అమానుషమని అన్నారు. కిడ్నాప్ తర్వాత నాలుగు రోజులు గడిచినప్పటికీ పోలీసులు దుండగులను పట్టుకోలేకపోయారన్నారు. పైగా బాధిత కుటుంబాన్నే వేధించారని, హత్య జరుగుతుందని తెలిసినా పోలీసులు విచారణలో జాప్యం చేశారని ఆరోపించారు.

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు మాట్లాడారు. కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, రాజశేఖర్ భార్య వాణికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసును సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో షాద్‌నగర్, మొయినాబాద్ పోలీసుల నిర్లక్ష్యం, వారి సహకారంపై విచారణ జరగాలన్నారు.

టిపిఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 142 కుల దురహంకార హత్యలు జరిగితే.. ముస్లింలు నాగరాజును చంపినప్పుడు మాత్రమే బీజేపీ స్పందించిందని, మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి ఆ హత్యను ఉపయోగించుకుందని విమర్శించారు. ఒక దళితుడిని అగ్రకులోన్మాదులు చంపితే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బిజెపి అగ్రనేతలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. హిందువులందరూ బంధువులనే ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలు కులోన్మాదం పేరిట ఎన్ని హత్యలు జరిగినా బలపరుస్తారా? అని ప్రశ్నించారు. ప్రముఖ రచయిత, కులనిర్మూలన సంఘం వ్యవస్థాపక సభ్యులు వి లక్ష్మీ నాగేశ్వర్ మాట్లాడుతూ.. కులదురహంకార హత్యలను అరికట్టాలంటే పౌర సమాజం కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని, హత్యలను ఖండించాలన్నారు.

సమావేశంలో కులనిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండీ వహీద్, బంధు సొసైటీ అధ్యక్షులు పల్లాల వీరస్వామి, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, వీసీకే పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తెలంగాణ శ్యామ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర నాయకులు కడమంచి రాంబాబు, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు ఎం కృపాసాగర్, బి సుబ్బారావు, పి భాగ్య, మధు, సిఐటియు నాయకులు జి రాములు, సోమయ్య, ఒయు విద్యార్థి నాయకులు దాసరి బాలస్వామి, శ్రీనివాస్, మహేష్ దుర్గి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరి ప్రాణం తీసిన రాంగ్ రూట్ డ్రైవింగ్
- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాంగ్ రూట్ ప్రయాణం ఇద్దరి ప్రాణం తీసింది.. రాంగ్ రూట్‌లో వచ్చిన కారు.. నేరుగా వచ్చిన మరో కారును ఢీకొట్టింది. ఇద్దరు మృతిచెందారు.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వంశీధర్‌రెడ్డి, ఆయన అత్త సుజాత, బంధువు రోజా డ్రైవర్ వెంకట్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొయినాబాద్‌లోని పెంటయ్య హోటల్ దగ్గరకు రాగానే.. హైదరాబాద్ నుంచి కేతిరెడ్డిపల్లి సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్‌లో ఫొటో షూట్ కోసం వెళ్తున్న ఓ కారు రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి వంశీధర్‌రెడ్డి కారును ఢీకొట్టింది. రాంగ్ రూట్‌లో వచ్చిన కారు డ్రైవర్ కరీమ్(37) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. అదే కారులో ఉన్న లోకేష్ (24)కు తీవ్ర గాయాలు కావడంతో భాస్కర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. ఈ ప్రమాదంలో బాబురావు, అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అలాగే మరో కారులో ఉన్న వంశీధర్‌రెడ్డి, ఆయన అత్త సుజాత, బంధువు రోజా, డ్రైవర్ వెంకట్ కూడా గాయపడటంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వంశీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



డిసెంబర్ 8, 9 తేదీల్లో రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- రాచకొండ సిపి సుధీర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 8, 9 తేదీల్లో మహేశ్వరం జోన్ మీర్‌ఖాన్‌పేట పరిధిలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాచకొండ సిపి జి సుధీర్‌బాబు తెలిపారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ బందోబస్తును శుక్రవారం సిపి పర్యవేక్షించారు. వివిఐపిలకు ఎలాంటి అసౌకర్యం, అంతరాయం కలగకుండా అడుగడుగునా నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని మీర్‌ఖాన్‌పేటలో వంద ఎకరాల్లో సమ్మిట్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సిపి తెలిపారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతోపాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, ప్రత్యేక బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్కింగ్ స్థలం, హెలిప్యాడ్ ప్రదేశం, మీటింగ్ ప్రదేశాన్ని రోడ్ మ్యాప్‌ను సీపీ పరిశీలించి.. అధికారులకు సలహాలు సూచనలు చేశారు. సీపీ వెంట మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏపీసీ తదితరులు ఉన్నారు.